# సంచార దీపాలు

కూర్చున్న కుర్చీలోంచి కదలకుండా కాయితాలతో కథల్ని నడిపించవచ్చునేమో కాని, కంపెనీల్ని నడిపించడం కష్టం. అందుకని అడపా దడపా ఆఫీసుల్లోని అధికారులూ, ఉద్యోగులూ అటూ యిటూ దేశ సంచారం చేస్తేనే కాని, ఈ ఆధునిక యుగంలో పనులు త్వరగా జరగవు! విమానాల్లో, రైళ్ళలో మొదటి తరగతుల్లో, ప్రయాణాలు చేసేవాళ్ళలో నూటికి యాభై మందికి పైగా, ఆఫీసు వ్యవహారాల మీద దేశాటన కావించేవాళ్ళే. అయితే ఆ చేసే ప్రయాణాలన్నీ నిజంగా ఆఫీసు పని కోసమేనా అంటే మట్టుకు....?

మెంబర్ మధుసూధనరావు కాలింగ్ బెల్ బటన్ నొక్కాడు. అప్పలస్వామి తలుపు తీసుకొని అయ్యగారి ఎయిర్ కండిషన్డ్ గదిలోకి ప్రవేశించి, చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"సెక్రటరీ సోమశేఖరం గదిలో లేడా ఏమిటి? రెండుసార్లు ఇంటర్‌కాం చేసినా బజర్ వాగుతోందే కాని, సమాధానం లేదు. పోయి చూసిరా" అన్నాడు మధుసూధనరావు తలెత్తకుండా ఏదో ఉత్తరంలోకి చూస్తూ.

"తలనొప్పిగా ఉందని కాఫీ తాగడానికని కేంటీన్‌కి వెళ్ళారండి. ఓ పది నిముషాల్లో వచ్చేస్తానన్నారు. నేను వెళ్ళి తీసుకువస్తాను సార్" అని అప్పలస్వామి బయటకు వెళ్ళాడు.

మరో అయిదు నిమిషాల్లో సోమశేఖరం గదిలో ప్రవేశించాడు.

"సారీ సర్! ఆస్ప్రో బిళ్ళ కోసం గేటు బయటకు వెళ్ళడంతో ఆలస్యమైంది. చింతలపూడి ప్రాజెక్టు చీఫ్ యింజనీరుగారు పంపించిన కాయితాల కోసమే అయితే, డైరెక్టరుగారు వాటిని చూసి ఓ యిరవై నిమిషాల క్రితం పంపారు. తీసుకురమ్మంటారా?" అన్నాడు ఓ పక్కగా నిలబడి.

"ఆ చింతలపూడి ప్రాజెక్టు ఫైలూ, భీమవరం ప్రాజెక్టు ఫైలూ, రెండింటినీ పట్టుకురండి. ఈ రెండు ప్రాజెక్టుల తాలూకు కొన్ని విషయాల్ని ముఖాముఖి చర్చించడం కోసం నేను విజయవాడకు వెళ్ళాలి. చీఫ్ ఇంజనీర్‌ని చింతలపూడి నుండి రేపు

సాయంత్రానికి విజయవాడ రమ్మని అర్జంట్ టెలిగ్రాం పంపండి. రేపు సాయంత్రానికి విమానంలో టిక్కెట్ కోసం పబ్లిక్ రిలేషన్స్‌కు కబురు పంపండి. గెస్ట్‌హౌస్‌లో గది కేటాయించమని, ఎయిర్‌పోర్ట్‌కి కారు పంపించమని విజయవాడ ఆఫీసుకి ఫోన్ చెయ్యండి. ఛైర్మన్‌గారు గదిలో ఉన్నారేమో కనుక్కొని, ఫోన్ కనెక్ట్ చెయ్యండి" అని మధుసూధనరావు, బల్ల మీద పడి ఉన్న ఉత్తరాన్ని మరొకసారి చదవసాగాడు.

"సర్, నేను కూడా రావాల్సి ఉంటుందా? ఆ పక్షంలో అడ్వాన్స్ తీసుకోవాలి. మీరక్కడ ఎన్ని రోజులుండేది చెప్తే మీ టూర్ ప్రోగ్రామ్ టైప్ చేసి తీసుకొస్తాను," అన్నాడు సోమశేఖరం.

"మీరు రావాల్సిన అవసరం లేదు. నేను నాలుగు రోజులు అక్కడే ఉండాల్సి వస్తుంది. నా అడ్వాన్స్ కోసం ఏర్పాటు చేయండి", అన్నాడు మధుసూధన్‌రావు. సోమశేఖరం కేసి చూస్తూ 'అలాగే'నంటూ సోమశేఖరం పక్కనే ఉన్న ఒక చిన్న తలుపు తోసుకొని పక్కనే ఉన్న తన చిన్న గదిలోకి వెళ్ళాడు.

మరో రెండు నిమిషాల్లో ఫోన్ మ్రోగింది. మధుసూధన్ రావు ఫోన్ ఎత్తాడు.

"మీరు విజయవాడ వెడుతున్నట్టు మీ సెక్రటరీ ద్వారా తెలిసింది. ఆ రెండు ప్రాజెక్టులలోనూ ప్రోగ్రెస్ సరిగా లేదు. చీఫ్ ఇంజనీర్‌ని కొద్దిగా హెచ్చరించండి. అన్నట్లు రేపు నేను ఢిల్లీకి వెళ్ళవలసిన అవసరం వచ్చింది. గ్రాంట్ల విషయమై మినిష్టరీతో మాట్లాడాలి. నాలుగైదు రోజులు పట్టవచ్చు. ఈలోగా మీరు విజయవాడ టూర్ పూర్తి చేసుకొని రండి. తరువాత ఆ ప్రాజెక్టు తాలూకు రిపోర్టుని ప్రభుత్వానికి అందజేద్దాం," అన్నాడు అటువైపు నుంచి ఛైర్మన్ పీతాంబరన్.

"సమయం ఉండి వీలు కుదిరితే, మీరు లక్కవరం ప్రాజెక్టు ప్రాతిపదికని గురించి కూడా మాట్లాడితే బాగుంటుందేమో?" అన్నాడు మధుసూధన రావు.

"నాకంత తీరుబడి ఉండదు. మీరు డైరెక్టర్ని ఢిల్లీకి పంపండి. ఆయన్ని స్పేడ్ వర్క్ చేసి రమ్మనండి. వివరాలు వచ్చే నెలలో చూడొచ్చు" అని ఛైర్మన్ ఫోన్ పెట్టేశాడు.

మధుసూధన్‌రావు, డైరెక్టర్ చలపతిరావుని తన గదికి రప్పించి అన్నాడు- "మీరు వెంటనే ఢిల్లీకి వెళ్ళి లక్కవరం ప్రాజెక్టు ప్రాతిపదికను చర్చించి రావాలి. ఛైర్మన్‌గారు ఢిల్లీలోనే ఉంటారు కాబట్టి, అవసరం వస్తే ఆయన సలహా అక్కడే తీసుకోవచ్చును."

"ఢిల్లీ వెళ్ళడానికి అభ్యంతరం లేదు. కానీ కలకత్తా కూడా వెళ్లవలసిన అవసరం తగిలింది. పోర్టు కస్టమ్స్ ఈ మధ్య క్లియరెన్స్ విషయమై చాలా ఇబ్బంది పెడుతున్నట్లు అక్కడ ఆఫీసర్ ఇన్‌ఛార్జ్ ఫోనులో మాట్లాడాడు. మనది కూడా ప్రభుత్వ శాఖే అయినా, వాళ్ళ రూల్సు మట్టుకు ప్రాణాలు తీస్తున్నాయి. వాళ్ళతో పర్సనల్‌గా మాట్లాడి వస్తేనే కానీ, కలకత్తా పోర్టులో ఇరుక్కుపోయిన యంత్ర సామగ్రి బయటికి వచ్చేటట్లు లేదు! ఏమంటారు?" అన్నాడు చలపతిరావు.

"దానికేం, అలాగే వెళ్లండి. మీరు ముందుగా ఢిల్లీ వెళ్ళి అక్కడ్నుంచి కలకత్తా

వెళ్ళండి. మీరు కూడా ఢిల్లీ వస్తున్నట్లుగా ఛైర్మన్‌గారికి నేను చెప్తాను'' అన్నాడు మధుసూధన్ రావు.

తన గదికి తిరిగి వచ్చిన డైరెక్టర్ చలపతిరావు తన ఢిల్లీ, కలకత్తా ప్రయాణం తాలూకు ప్రయత్నాల్ని పి.ఏకి అప్పగించి, కాఫీ తాగుతున్న సమయంలో, రీసెర్చ్ వింగ్ సీనియర్ సైంటిస్ట్ చిదంబరం, ఒక ఫైలు పట్టుకువచ్చాడు.

''రండి! మీ కోసం కూడా కాఫీ తెప్పించేదా?'' అన్నాడు చలపతిరావు.

''థాంక్స్, అక్కర్లేదు! నేనిప్పుడే టీ తాగి వచ్చాను. ఆ మద్రాస్ కంపెనీ సరఫరా చేసిన కెమికల్ శాంపుల్సు మన 'స్పెసిఫికేషన్స్'కి తగ్గట్టుగా లేవు. వాళ్ళతో స్వయంగా మాట్లాడి వస్తే తప్ప, మరో మార్గం లేదు! మద్రాసుకి నా టూర్ ప్రోగ్రామ్ తీసుకువచ్చాను,'' అన్నాడు చిదానందం ఫైలు చలపతిరావు ముందుంచుతూ.

చలపతిరావు చదివి సంతకం చేశాడు, మారు మాట్లాడకుండా చిదానందం డైరెక్టర్ గది నుంచి తిన్నగా లేబరేటరీస్‌కి పోయి, శాంపిల్సు ఎనలైజ్ చేసిన కెమిస్ట్ రామ్మూర్తి దగ్గర్నుంచీ రిపోర్టు తీసుకున్నాడు. రామ్మూర్తి కొద్దిగా తటపటాయించి, ''సార్, పొద్దున రాగానే మీతో మాట్లాడిన తర్వాత, ఎందుకైనా మంచిదని మరొకసారి శాంపిల్ టెస్ట్ చేశాను. నిస్సందేహంగా క్లోరేట్ ప్రతి శాతం మనం అడిగిన దానికన్నా ఎక్కువగా ఉంది. మీరు సరేనంటే, నేను మద్రాస్‌కి వెళ్ళి వస్తాను'' అన్నాడు.

చిదానందం ఒక్క క్షణం రామ్మూర్తికేసి చూశాడు.

''నీకు మద్రాస్ వెళ్ళాలని ఉదయమే చెప్పి వుంటే బాగుండేది. డైరెక్టర్ నన్ను స్వయంగా వెళ్లమని, ఇప్పుడే ఆదేశించాడు. ఇప్పుడు మళ్ళీ వెళ్ళి నిన్ను పంపించమని అడిగితే - నేను వెళ్ళడం యిష్టం లేక నిన్ను పంపిస్తున్నాని అనుకొంటాడు. ఇంతలో కొంప మునిగిపోయింది లేదు! నేను తిరిగి వచ్చిన వారం రోజుల్లో, అక్కడే వాళ్ల సమక్షంలో శాంపిల్సు ఎనలైజ్ చేయ్యడానికి, నిన్ను పంపిస్తాను'' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

''అది కాదు సార్! మద్రాసులో ఈ పని చూసుకొని, ఓ రెండు రోజుల సెలవు మీద అక్కణ్ణుంచి తిరుచిరాపల్లి వెళ్దామనుకొన్నాను'' అన్నాడు రామ్మూర్తి నిరాశగా.

''అసలు సంగతి అలాగని చెప్పరాదూ? మీరు వెంటనే సేలం వెళ్ళి, అక్కడున్న 'సుజాత ఇండస్ట్రీస్' మనకి పంపవలసిన లేబొరేటరీ పరికరాల్ని త్వరగా పంపేటట్టు చూసి రండి. వెళ్ళేటప్పుడు కాని వచ్చేటప్పుడు కాని తిరుచురాపల్లిలో మీ పని చూసుకోవచ్చు! ఏమంటారు?'' అన్నాడు చిదానందం.

రామ్మూర్తి బుర్ర ఊపాడు. చిదానందం రిపోర్టుతో వెళ్లిపోయాడు.

రామ్మూర్తి కులాసాగా కుర్చీలో కూర్చుంటుండగా అసిస్టెంట్ కెమిస్టు కుమార మంగళం వచ్చి, ''నా సెలవు సంగతి ఏం చేసినట్లు? నేను బెంగుళూరు వెళ్ళాలి!'' అన్నాడు.

''చూడు కుమార మంగళం, డైరెక్టరుగారి ఆదేశ ప్రకారం చిదానందంగారు నన్ను

'సేలం' వెళ్లమన్నారు. నువ్వూ నేనూ ఒకేసారి లేకపోతే ఎలా? అందుకని నేను తిరిగి వచ్చిన తర్వాత వెడ్దువుగాని'' అన్నాడు రామ్మూర్తి అనునయంగా.

''రిజర్వేషన్ దొరకదు కదా అని ముందరే టికెట్ కొనుక్కున్నాను. మీరిప్పుడు కాదంటే ఎలా?'' అన్నాడు కుమారమంగళం నిందాస్వరంతో.

''నువ్వు బెంగుళూరు ఓ వారం రోజుల తర్వాత వెళ్ళితే నష్టముందా?'' రామ్మూర్తి సూటిగా ప్రశ్నించాడు.

''లేదనుకోండి కాని....'' నసిగాడు కుమారమంగళం.

''అలాగయితే ఫర్వాలేదు! నీ టికెట్ కేన్సిల్ చేయించుకో. నేను తిరిగి వచ్చిన తర్వాత నిన్ను బెంగుళూరు టూరు మీద పంపిస్తాను. అనవసరంగా నాలుగు రోజులు కాజువల్ లీవు దండగ చేసుకోవడం ఎందుకు?'' అన్నాడు రామ్మూర్తి.

కుమార మంగళం తెలివితక్కువ వాడేం కాదు. అప్పటికప్పుడు టూరు ప్రోగ్రాం రాసి రామ్మూర్తికిచ్చాడు. దానిమీద రామ్మూర్తి సంతకం చేసి స్వయంగా తీసుకువెళ్ళి చిదానందం చేత కూడా సంతకం చేయించి ఆ కాయితాన్ని కుమారమంగళం చేతిలో పెట్టాడు. అప్పటిగ్గాని అతగాడు శాంతించలేదు.

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసులో పన్జేస్తున్న జూనియర్ అసిస్టెంట్ నరసింహమూర్తి టూర్ల మీద వెళ్లే పెద్దాఫీసర్లకు విమానం టిక్కెట్లు, చిన్నాఫీసర్లకు రైల్వే టిక్కెట్లు కొనుక్కు వచ్చి వాళ్ళ ఆఫీసరు నాగరాజన్‌కి అందజేసి, యింటికి వెళ్ళేసరికి శ్రీకాకుళం నుంచి అన్నగారు రాసిన ఉత్తరం చేతిలో పెట్టింది అతగాడి భార్య. 'మనింట్లో అద్దెకున్న ఆసామి యిల్లు ఖాళీ చేయటం లేదు సరిగదా, నానా గొడవా చేస్తున్నాడు. నువ్వు వీలుచూసుకొని రా!' - అన్నగారి ఉత్తరంలో సారాంశం అది. ఓ కప్పు కాఫీ తాగి నరసింహమూర్తి నాగరాజన్ యింటికి పరుగెత్తాడు, దార్లో ఓ డజను బత్తాయి పళ్ళు కొనుక్కొని.

''భువనేశ్వర్ ఆఫీసుకి అర్జంటుగా కాయితాలు తీసుకువెడ్దువుగాని సరేనా?'' అని నాగరాజన్, నరసింహమూర్తికి మాట యిచ్చి సంతోషపరిచి పంపించేశాడు.

మెంబర్ మధుసూధన రావు ఆఖరి కొడుక్కి ప్రైవేట్ చెప్పి రాత్రి ఎనిమిదింటికి యింటికి చేరిన స్కూలు టీచరు అవధాని చేతిలో పెళ్ళాం టెలిగ్రాం పెట్టింది. ''నాన్నగారికి మళ్ళీ మతి చలించింది. వీలైనంత త్వరలో బయలుదేరిరా'' అని కాకినాడ నుంచి తమ్ముడు పంపిన టెలిగ్రాం అది.

ఛైర్మన్ పీతాంబరం ఢిల్లీ వెళ్ళాడు. ఓ రోజు సంస్థ తాలూకు వ్యవహారాలు చూసుకొని మిగిలిన మూడ్రోజులూ అక్కడే మకాం వేశాడు. లండన్‌లో పన్జేస్తున్న చిన్ననాటి స్నేహితుడు హాంగ్‌కాంగ్ వెడ్తూ, దార్లో ఢిల్లీలో ఆగాడు. ఆ మూడ్రోజులూ వాళ్లిద్దరూ హాయిగా చిన్ననాటి సంగతుల్ని నెమరువేసుకొంటూ, కాలం గడిపేశారు.

మధుసూధనరావు విజయవాడలో దిగిన రాత్రే అక్కడికి అప్పటికే చేరిన చీఫ్ యింజనీరుతో ఓ గంట మాట్లాడి, ఆదేశాలిచ్చి పారేశాడు. మర్నాడుదయం ఆఫీసు కారు

తీసుకొని నిడదవోలు పోయి, తన పొలాల సంగతీ, మామిడి తోటల సంగతీ చూసుకొని, నాలుగో రోజుకి మళ్ళీ విజయవాడ చేరుకొన్నాడు. ఆలోపుగా చీఫ్ యింజనీరు విజయవాడ నుంచి గుంటూరు పోయి, తను కట్టుకుంటున్న యింటికి దగ్గరుండి స్లాబ్ పోయించుకొని విజయవాడ తిరిగి చేరుకున్నాడు. అప్పటికి తిరిగి వచ్చిన మెంబర్ని మరోసారి కలుసుకొని చింతలపూడి వెళ్ళిపోయాడు. మధుసూధనరావు విమానంలో హైదరాబాద్ చేరుకున్నాడు.

డైరెక్టర్ చలపతిరావు ఢిల్లీ వెళ్ళి, అక్కడ ఛైర్మన్‌గారికి ఓసారి మొహం చూపించి, లక్కవరం ప్రాజెక్టు గురించి మంత్రిగారి సెక్రటరీ ఆఫీసులో ఓ నాలుగు ముక్కలు మాట్లాడి, అక్కణ్నించి కలకత్తా వెళ్లాడు. వెళ్లిన రోజు పోర్టు కస్టమ్స్ వాళ్ళతో మాటవరసకి మాట్లాడి, 'అలాగే' అని అనిపించుకొని - అక్కడ హాస్టల్లోంచి గెంటివేయబడ్డ కుమారరత్నాన్ని ఓ రెండు రోజుల మంతనాల తర్వాత మళ్ళీ చచ్చీచెడి చేర్పించి కలకత్తా నుంచి హైదరాబాదు విమానంలో చేరుకొన్నాడు.

చిదానందం మద్రాసుకు పోయి తన లేబొరేటరీ పని చూసుకొని, వచ్చేటప్పుడు నెలలు నిండిన కూతుర్ని పురుటికి తీసుకువచ్చాడు.

రామ్మూర్తి సేలం వెడ్తూ దార్లో దిగి, తిరుచురాపల్లి యింజనీరింగ్ కాలేజీలో కొడుకుని చేర్పించి, హాస్టల్లో కుదేసి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. సేలంలో పని చూసుకొని, హైదరాబాద్ చేరుకొన్నాడు.

కుమార మంగళం బెంగుళూరులో తల్లిదండ్రుల దగ్గరే ఉంటూ, ఓ పక్క ఆఫీసు పని చూసుకుంటూనే, మూడు పెళ్ళి సంబంధాలు కూడా చూసుకొని, ఓ పిల్లని ఖాయపరుచుకొని, భారమైన హృదయంతో హైదరాబాదు చేరుకొన్నాడు.

నరసింహమూర్తి భువనేశ్వర్ నుంచి తిరిగి వస్తూ, శ్రీకాకుళంలో దిగి, వాళ్ల యింట్లో అద్దెకున్న ఆసామీని ఖాళీ చేయించడం కోసం లాయర్ నోటీసులూ అవీ యిప్పించి, అవసరమొస్తే దావా కోసం ఏర్పాట్లు చేసి, మరీ వచ్చాడు.

లౌక్యంగా కాని, బాహాటంగా కాని, తమ స్వంత పనులను చక్కపెట్టుకోడానికి ప్రజల సొమ్ముతో ప్రయాణాలు చేసే పెద్ద మనుషుల తీరు తెన్నులలా ఉండగా- ఏ చేతుల్నుంచి టెలిగ్రాం అందుకొన్నాడో అవే చేతుల్నించి ఉన్న ఆ ఒక్కగాజునీ అందుకొని అమ్మితేనే కాని, కాకినాడ వెళ్లి ఆ యింట్లో వాళ్ళకి ధైర్యం చెప్పి తిరిగి రాగల దిక్కు లేక పోయింది అవధానికి.

"ఇటువంటి అవకాశాలున్న సంస్థల్లో, ఆఫీసుల్లో పనిచేసే వారందరూ ఇలానే ప్రవర్తిస్తారా!" అంటే - 'కాదు కొందరే!' అని ఖచ్చితంగా చెప్పవచ్చునేమో కాని, "అవసర మొచ్చి, అవకాశముంటే, అవధాని లాంటి వాళ్లు కూడా అలానే ప్రవర్తిస్తారేమో!" అంటే మట్టుకు సమాధానం చెప్పడం కష్టమే! అది మనిషి వ్యక్తిత్వం మీదా, నైతిక విలువల మీదా ఆధారపడి ఉంటుంది. ●

('యువ' మాసపత్రిక)